నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, సోమవారం 12 మే 2025 | SIDDIPET

మంచుకొండల్లో మీసేవలు అమోఘం

కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, మే 11: కేదార్‌నాథ్ మంచుకొండల్లో ఎముకలు కొరికే చలిని సైతం లెక్క చేయకుండా సిద్దిపేట కేదార్‌నాథ్ అన్నదాన సమితి సభ్యులు పదిరోజుల పాటు అన్నదానం చేయడం గొప్ప విషయమని, ఈ కార్యక్రమం చేపట్టి సిద్దిపేట గొప్పతనం ఎల్లలు చాటేలా చేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అభినందించారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కేదార్‌నాథ్ సేవా సమితి సభ్యులను, అందులో పాలు పంచుకున్న వారిని ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కేదార్‌నాథ్‌కు వచ్చే భక్తులకు మానవ సేవనే.. మాధవ సేవగా భావిస్తూ మీరు ఏటా అన్నదానం చేయడం ఎంతో గొప్ప సేవ అన్నారు. ఇంతటి మహద్భాగ్యం మీకు దక్కిందని, ఇది ఎప్పుడూ కొనసాగాలని, అందుకు తన సంపూర్ణ సహాయ సహకారం ఉంటుందని హరీశ్‌రావు వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో జరిగిన భజన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, మే 11: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, హనుమాన్ దీక్ష స్వీకరించడం.. శ్రీరామ నామ జపంతో అంతా మంచి జరుగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం రాత్రి సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో హనుమాన్ మాలధారుల భజన, పూజా కార్యక్రమంలో హనుమాన్ దీక్షా పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. హనుమాన్ స్వాములు ఇంత పెద్ద ఎత్తున ఇక్కడికి రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్ల తెలిపారు. నిత్యం హనుమాన్ చాలీసా పఠనం, శ్రీరామ నామ జపం ఎంతో బలాన్ని ఇస్తుందన్నారు. హనుమాన్ దీక్షా పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామీజీ ఆధ్వర్యంలో ఇంత పెద్ద ఎత్తున స్వాములు వచ్చి భజన చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. సిద్దిపేటలో 40 ఏండ్ల క్రితం హనుమాన్ దీక్షాకు బీజం పడిందని, నాడు స్వామీజీ ఆధ్వర్యంలో ఐదుగురితో సిద్దిపేటలో మొదలైన ఈ దీక్ష ఇప్పుడు లక్షలాది మంది స్వీకరించేలా చేసిందని చెప్పారు. సిద్దిపేటలో ఆరంభించిన ఏ కార్యమైనా సిద్ధిస్తుందని, సిద్దిపేట మట్టిలోనే ఆధ్యాత్మిక.. ధార్మిక బలం ఉందన్నారు. ఆపరేషన్ సిందూరం విజయవంతం కావాలని అనేకమంది ఆలయాల్లో పూజలు నిర్వహించినట్లు హరీశ్‌రావు తెలిపారు. నేడు హనుమాన్ మాల ఎల్లలు దాటిందని హనుమాన్ దీక్షా పీఠాధిపతులు దుర్గా ప్రసాద్ స్వామీజీ అన్నారు. సిద్దిపేటలో తక్కువ సంఖ్యలో మొదలైన హనుమాన్ దీక్ష ఎన్నో లక్షలాది మందికి సూచిక అయ్యిందన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు నాయకులు ఉండడం వల్లనే నిత్యం నీళ్లు, కరెంట్, అన్ని కార్యక్రమాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు హరీశ్‌రావు అని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే హరీశ్‌రావు భజనలో పాల్గొన్న స్వాములకు భిక్ష ఏర్పాటు చేసి తాంబూలాన్ని అందజేశారు.

భజన కార్యక్రమంలో పాల్గొన్న హనుమాన్ మాలధారణ స్వాములు

సమస్యల పరిష్కారానికి కృషి

కొత్త దొమ్మాటలో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మే 11: గ్రామస్తులు ఐక్యంగా రెండు ఆలయాలను నిర్మించుకుని విగ్రహాలను ప్రతిష్ఠించుకోవడం అభినందనీయమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని కొత్త దొమ్మాటలో పెద్దమ్మతల్లి, దుర్గమ్మతల్లి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యా, వైద్యపరంగా నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సహాయాన్ని తాను అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లోనూ దీనిని కొనసాగిస్తానని హామీనిచ్చారు. గుడి కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల పూర్తి, సమస్యల పరిష్కారానికి తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం చేర్యాల పట్టణానికి చెందిన కొమురవెల్లి ఆలయ మాజీ డైరెక్టర్ ఉత్కూరి అమర్‌నాథ్ గౌడ్ అమ్మమ్మ బీమగోని శంకరమ్మ దశదిన కర్మలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని, శంకరమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

దేశసేవలో అన్నదమ్ములు

రాయపోల్, మే 11: సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని మంతూర్‌కు చెందిన ఇద్దరు అన్నదమ్ములు సైన్యంలో విధులు నిర్వహిస్తూ దేశ సేవ చేస్తున్నారు. అనాజీపూర్‌కు చెందిన రిటైర్డ్ ఆర్మీ సైనికుడు నీల చంద్రం సోదరి ఇద్దరు కుమారులు నందీశ్వర్, ఆంజనేయులు మేనమామ బాటలోనే ఆర్మీలో చేరారు. మేనమామ ప్రోత్సాహంతో వీరిద్దరూ 2018లో ఆర్మీకి ఎంపికయ్యారు. ఆంజనేయులు ప్రస్తుతం జమ్ముకశ్మీర్ సెక్టార్‌లోని బారాముల్లా వద్ద, నందీశ్వర్ రాజస్థాన్‌లోని జైసల్మేర్ సెక్టార్‌లో విధులు నిర్వహిస్తున్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని రాయపోల్ మండలంలోని వీరారెడ్డిపల్లి, తిమ్మక్కపల్లి, మంతూర్ తదితర గ్రామాల నుంచి ఒక్కొక్కరు ఆర్మీలో చేరారు.

బారాముల్లా సెక్టార్‌లో విధులు నిర్వహిస్తున్న నందీశ్వర్

జైసల్మేర్ సెక్టార్‌లో విధులు నిర్వహిస్తున్న ఆంజనేయులు

సిద్దిపేట జిల్లా తోటపల్లిలో పాత ప్లెక్సీలను ఇంటిపై కప్పుకొని నివసిస్తున్న ఓ నిరుపేద కుటుంబం

కొర్రీలతో కొంపకొల్లేరు..

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కొత్త నిబంధనలు

- ఇంటి నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగులలోపే పరిమితం
- 600 చదరపు అడుగుల వైశాల్యం మించిన ఇండ్లు రద్దు చేసిన అధికారులు
- తొలుత మంజూరు చేసి .. తాజాగా జాబితాలో పేరు లేదని తిరస్కరణ
- ఉన్న ఇల్లు పోయి..కొత్తది రాక రెంటికి చెడ్డ రేవడిలా పలువురి పరిస్థితి
- ఉన్న ఇల్లు కూలగొట్టుకొని అద్దెకు ఉంటున్న పలువురు
- బేస్‌మెంట్ పూర్తయినా బిల్లులు రావడం లేదు..
- ఉమ్మడి మెదక్ జిల్లాలో అయోమయంలో లబ్ధిదారులు



సిద్దిపేట జిల్లా తోటపల్లిలో బిల్లులు రాక నిలిచిపోయిన ఇందిరమ్మ ఇల్లు

తోటపల్లిలో ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసిన తరువాత రద్దు చేయడంతో ఆగిన పనులు

సిద్దిపేట, మే 11(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ఆదిలోనే అభాసుపాలవుతున్నది. ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని సంబురంగా పాత ఇంటిని కూలగొట్టుగొని కొత్త ఇంటి నిర్మాణం చేపట్టిన లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇంటి నిర్మాణం 400 చదరపు అడుగుల విస్తీర్ణానికి తక్కువ కాకుండా, 600 చదరపు అడుగులు విస్తీర్ణం దాటి చేపట్టవద్దని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీచేసింది. ఇప్పటికే చాలామంది ఇంటి పనులు ప్రారంభించారు. తీరా ఇప్పుడు ప్రభుత్వం కొత్త నిబంధనలు తేవడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం ఆదేశాలతో అధికారులు ఇండ్ల సర్వేను మళ్లీ మొదలు పెట్టారు. నిబంధనలు లేని ఇండ్లను రద్దు చేస్తున్నారు. లేదా కట్టిన ఇల్లు ఉంటే ఆ చదరపు అడుగుల్లోపు కుదించుకోవాలని అధికారులు సూచిస్తుండంతో లబ్ధిదారులు ఇల్లు కట్టాలా? వద్దా? అనే మీమాంసలో ఉన్నారు. పాత ఇల్లు పోయింది.. కొత్త ఇల్లు వచ్చే అవకాశం లేకుండా పోయిందని నిరుపేదలు వాపోతున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో అయోమయంలో లబ్ధిదారులు

ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన విధివిధానాలు ప్రకటించక పోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.తొలుత అందరికీ ఇందిరమ్మ ఇండ్లు అని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు నిబంధనలు మార్చింది. ప్రతి మండల కేంద్రంలో ఒక పైలట్ గ్రామాన్ని ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన వారికి ప్రొసీడింగ్‌లు ఇచ్చింది. ప్రభుత్వం చెప్పిన మాటలతో ఉన్న ఫలంగా ఇంటిని కూలగొట్టి దాని అడుగులోనే ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోసుకున్నారు పేదలు. కొంతమంది బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తి చేసుకున్నారు. తీరా ప్రభుత్వం నిబంధనలు మార్చింది. ప్రతి ఇంటి నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండాలని ఆదేశించింది. 600 చదరపు అడుగుల పైన ఉన్న ఇంటిని రద్దు చేయాలని సూచించింది. ఇప్పటికే చాలామంది బేస్‌మెంట్ లెవల్ పూర్తిచేసుకున్నారు. కొందరు గోడల పనులు ప్రారంభించారు. వివిధ దశల్లో ఉన్నాయి. ప్రభుత్వం తాజాగా విధించిన నిబంధనలతో చాలామంది ఇండ్లు రద్దయ్యే అవకాశం ఉండడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. కట్టిన వాటికి సైతం బిల్లులు రావడం లేదు. 600 చదరపు అడుగుల విస్తీర్ణం లోపల చేసుకుంటేనే బిల్లులు ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మాణం చేసుకుంటామని ప్రమాణ పత్రం రాసి ఇవ్వాల్సి వస్తున్నది. ఒక వేళ ఇప్పటికే ఇంటిని 600 చదరపు అడుగుల పైన నిర్మాణం చేసుకున్న వారు కుందించుకుంటామని ఎంపీడీవోకు హామీ పత్రం రాసిస్తే సంబంధిత అధికారుల వచ్చి నిర్మాణాన్ని కుదిస్తూ మార్కింగ్ చేస్తారు. ఇలా ఏవేవో నిబంధనలు పెట్టి తమతో ప్రభుత్వం అడుకుంటున్నదని లబ్ధిదారులు మండిపడుతున్నారు.

ఏ జిల్లాలో ఎన్నెన్ని?

- ఇప్పటి వరకు సిద్దిపేట జిల్లాలో 2667 ఇండ్లు మంజూరు కాగా, 665 ఇండ్లకు ముగ్గుపోశారు. 254 ఇండ్లు బేస్‌మెంట్ లెవల్ పూర్తిచేశారు. 135 ఇండ్లకు బెస్‌మెంట్ బిల్లులు చెల్లించారు.
- మెదక్ జిల్లాలో 1339 ఇండ్లు మంజూరు కాగా, 320 ఇండ్లు గ్రౌండింగ్ చేశారు.80 ఇండ్లు బేస్‌మెంట్ లెవల్ పూర్తికాగా, 47 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఇటీవల రూ లక్ష చొప్పున బిల్లులు ఇచ్చారు.
- సంగారెడ్డి జిల్లాలో 3939 ఇండ్లు మంజూరు కాగా, 387 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయి. బేస్‌మెంట్ లెవల్‌లో 118 ఇండ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో 81 ఇండ్లకు బేస్‌మెంట్ బిల్లులు ఇచ్చారు.

పైలట్ గ్రామం తోటపల్లిలో..

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని తోటపల్లి గ్రామాన్ని ఇందిరమ్మ ఇండ్ల పైలట్ ప్రాజెక్టుగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ గ్రామంలో ఇండ్లు లేని 135 మందిని అర్హులుగా గుర్తించారు.తదుపరి ఇందులో 15 మందిని తిరిగి అనర్హులంటూ పేర్కొని 120 మందికి ప్రొసీడింగ్ కాపీలు అధికారులు అందచేశారు. క్షేత్రస్థాయిలో 40 ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సర్కారు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తుందన్న ఆశతో కొందరు ఉన్న ఇల్లు కూలగొట్టుకొని నిరాశ్రయులయ్యారు. ఇందిరమ్మ ఇండ్ల నిబంధనల పేరుతో సర్కారు కొర్రీలు పెడుతుండడంతో మిగతా ఇండ్లు కట్టుకోవడానికి లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. మొదటి దశ ఇండ్లు పూర్తి చేసుకున్న వారికి బిల్లుల చెల్లింపు జరగడం లేదు. మూడు, నాలుగు రోజుల నుంచి అధికారులు ఇండ్ల కొలతలు వేస్తుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. 600 చదరపు అడుగులు దాటితే ఇండ్లు ఇందిరమ్మ ఇండ్ల పథకం పరిధిలోకి రావని అధికారులు చెబుతుండడంతో లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు.

సిద్దిపేట జిల్లా తోటపల్లిలో బిల్లులు రాక నిలిచిపోయిన ఇందిరమ్మ ఇండ్లు

సర్కారు సాయంతో ఇంటి నిర్మాణం పూర్తి కాదు..

కాంగ్రెస్ సర్కారు ఇచ్చే రూ. 5లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కాదు. గ్రామంలో 5 ఇండ్లను నిర్మాణం చేపట్టాను. మొదట ఎలాంటి షరతులు లేకుండా ఇండ్లు కట్టుకోవాలని చెప్పడంతో కొందరు ఇండ్లు కూలగొట్టుకున్నారు. ఇప్పుడు నిర్మాణం మొదలుపెట్టిన తర్వాత 600 చదరపు అడుగులు దాటిన ఇండ్లను ఇందిరమ్మ పథకంలోకి రావంటూ అధికారులు కొలతలు వేస్తున్నారు. దీంతో గ్రామంలో 15 రోజులుగా ఇండ్ల నిర్మాణం నిలిచిపోయాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకోవడం లబ్ధిదారులకు ఇబ్బందే.

– మాధవ, తాపీమేస్త్రి

ఇల్లు మొదలు పెట్టిన తర్వాత ఆపేయమన్నారు...

మా అమ్మ శాతవేని ఎలేంద్ర పేరిట ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ముగ్గు పోసి ఇంటి నిర్మాణం మొదలుపెట్టాము. తీరా అధికారులు వచ్చి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇల్లు నిర్మాణం జరుగుతున్నదని ఆపేయమన్నారు. దీంతో బేస్‌మెంట్ లెవల్‌లో నిర్మాణం చేసి వదిలేశాం. కట్టిన వరకు బిల్లు అడిగితే ప్రభుత్వ నియమాల ప్రకారం ఇల్లు నిర్మించుకుంటే బిల్లులు వస్తాయని చెప్పడంతో ఒక రూమ్ వదిలేసి నిర్మాణం చేపడుతున్నాము. బిల్లుల కోసం ఎదురు చూస్తున్నాం.

– శాతవేని మహేశ్, తోటపల్లి

పాత ఇంటిలో కాలం వెల్లదీస్తున్నాం...

మేము గతంలో కరీంనగర్‌కు బతుకుదెరువు కోసం పోయినం. ఐదారేండ్ల కిందట తోటపల్లికి వచ్చి ఇక్కడే కూలీ, నాలీ చేస్తూ బతుకుతున్నాం. మాకు లేని ఇందిరమ్మ ఇల్లు ఉన్నట్టుగా అధికారులు చెబుతున్నారు. కరీంనగర్‌లో ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇల్లు వచ్చిందని, అందుకే ఇప్పుడు ఇక్కడ మంజూరవడం లేదని పేర్కొంటున్నారు. మాకు అక్కడ ఇల్లు రాలేదు. ఇక్కడ ఇల్లు మంజూరు కావడం లేదు. లేని ఇందిరమ్మ ఇల్లు కోసం మమ్మల్ని ఇట్ల అన్యాయం చేయడం బాధాకరంగా ఉంది. మా ఇల్లు వానకాలంలో ఉరుస్తుండటంతో పాత ఫ్లెక్సీలను కట్టుకొని బతుకుతున్నం. – కొలిపాక ప్రేమలత, తోటపల్లి

పైలట్ ప్రాజెక్టే తప్పల తడక...

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి తోటపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. లబ్ధిదారుల జాబితా తప్పుల తడకగా ఉంది. 15 మంది అర్హులను అనర్హులుగా చూపిస్తున్నారు. నిజానికి వాళ్లు అర్హులు. గ్రామంలో విచారణ చేస్తే వాస్తవాలు బయటికి వస్తాయి. లబ్ధిదారులకు ఇండ్ల బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల పేరిట లబ్ధిదారులను ఆగం చేస్తున్నారు. నాది కూడా రేకుల షెడ్డు ఇల్లు. ఇందిరమ్మ ఇల్లుకు దరఖాస్తు చేసుకుంటే గతంలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని చూపెడుతుండన్నారు. ఏ అధికారికి దరఖాస్తు చేసుకోవాలో... ఎవరికీ విన్నవించుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నాం. – పోలవేని సంపత్, తోటపల్లి

ఒక్కరికి ఇల్లు మంజూరు కాలేదు..

మాకు తోటపల్లిలో వారసత్వంగా వచ్చిన ఒక్క ఇల్లు ఉంది. కానీ, మేము ముగ్గురం అన్నదమ్ములం. అందరికీ పెండ్లిలు అయి ఎవరి బతుకు వాళ్లు బతుకుతున్నాం. ఇందిరమ్మ ఇంటి కోసం మేం దరఖాస్తు చేసుకుంటే ఎవరికీ ఇల్లు మంజూరు కాలేదు. మేము అన్ని రకాలుగా అర్హులైనప్పటికీ మాకు ఇల్లు మంజూరు కాలేదు. అధికారులను అడిగితే రెండో విడతలో వస్తుందని చెబుతున్నారు. మొదటి దఫాలోనే ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇంక రెండో దఫా జాబితా వచ్చుడెప్పుడో.

– ఆవుల రవిచందర్, తోటపల్లి

ఇల్లు కూలగొట్టుకుని రోడ్డున పడ్డం...

ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకుంటే మంజూరైంది. పాత ఇంటిని కూలగొట్టగా అధికారులు వచ్చి ముగ్గు పోశారు. వారం రోజుల తర్వాత ఆన్‌లైన్‌లో ఇల్లు మంజూరు కాలేదని పంచాయతీ కార్యదర్శి పనులు ఆపివేయాలని చెప్పాడు. దీంతో ఉన్న ఇల్లు కూలగొట్టుకొని ఆగమయ్యాం. పక్కనే బంధువుల ఇంట్లో కిరాయికి ఉంటున్నం. మాలాగా గ్రామంలో 15 మంది అర్హులు ఉన్నప్పటికీ అనర్హుల కింద చూపిస్తున్నారు.

– గాదాసు బాలు, తోటపల్లి

బిల్లుల కోసం ఎదురుచూస్తున్నాం...

పాత పెంకుటిల్లును కూల్చి ఇందిరమ్మ ఇంటి కోసం ముగ్గు పోసుకున్నాను. సర్కారోళ్లు చెప్పినట్టుగానే 600 చదరపు అడుగులు లోపే ఇల్లు కట్టుకుంటున్నా.బేస్‌మెంట్ స్థాయిలో నిర్మాణం పూర్తయింది. కానీ, మొదటి దఫా రావాల్సిన బిల్లులు ఇంకా రాలేదు.అధికారులు వచ్చి ఇంటి కొలతలు వేసుకొని వెళ్లారు. 15 రోజులు అవుతున్నా బిల్లులు రావడం లేదు. బిల్లులు రాకుండా నిర్మాణం ఎలా చేయగలుగుతాం.

–పోలు లక్ష్మి, తోటపల్లి

కేంద్రానికి సీపీఐ సంపూర్ణ మద్దతు

బెజ్జంకి, మే 11: పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో ఆదివారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పెహెల్గాంలో ఉగ్రవాదులు అమాయక హిందూ బిడ్డలను పొట్టన పొట్టుకోవడం హేయమైన చర్య అన్నారు. దీనికి దీటుగా కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసి, పాక్‌కు తగిన బుద్ధి చెప్పిందన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని కోరారు. అనంతరం పెహెల్గాం మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బోనగిరి రూపేశ్, సీనియర్ నాయకుడు పొతిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకుడు సంగెం మధు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

చిరుత దాడిలో సాంబార్ జింక మృతి

రామాయంపేట రూరల్, మే 11: చిరుత సంచారం చేస్తూ దాడులు చేయడంతో రామాయంపేట మండలంలో ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో చిరుత సంచరించి పశువులు, మేకలు, గొర్రెలపై దాడులు చేసింది. మండలంలోని కాట్రియాల తండా, లాక్యాతండా సమీపంలో చిరుత దాడి చేసి అటవీ జంతువు సాంబారు జింకను హతమార్చింది. ఉదయం అరుపులు, చప్పుళ్లు విన్న రైతులు అటువైపు వెళ్లి చూడగా చిరుత దాడిలో ఆ వన్యప్రాణి మృతి చెందినట్లు తెలిపారు. విషయాన్ని రామాయంపేట అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి డీఆర్‌వో కుత్బోద్దీన్, బీట్ ఆఫీసర్ సాయికృష్ణ సందర్శించారు. అటవీ శాఖ వెటర్నరీ సర్జన్ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం వన్యప్రాణి సాంబారును ఖననం చేశారు. రాత్రి వేళల్లో రైతులు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లవద్దని చిరుత ఆనవాళ్లు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని అధికారులు తెలిపారు.

జింక కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు